


కొడంగల్‌కు చెందిన హిందీ పండిట్ కృష్ణకు హైదరాబాద్‌లో నియామక పత్రం అందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో కాంగ్రెస్ అగ్ర నేత కె.కేశవరావు, మంత్రులు పొన్నం ప్రభాకర్‌రావు, భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండాసురేఖ అభిషేక్, కాంగ్రెస్ నేత మనుసింఘ్వి, తదితరులు

దామగుండంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్

పూడూరు: మండల పరిధిలోని దామగుండం అటవీ ప్రాంతాన్ని కలెక్టర్ ప్రతీక్ జైన్ బుధవారం సందర్శించారు. ఇటీవల అటవీ శాఖ అధికారులు నాటిన మొక్కల సంరక్షణ, మొక్కల ఎదుగుదలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ నేవీ ప్రాజెక్టు ఏర్పాటు కోసం ఈ నెల 15న ముఖ్యమంత్రి హాజరు కానుండడంతో ఏర్పాట్లను పర్యవేక్షించినట్లు తెలిసింది.

గోమాత సకల సంపదలకు నిలయం: ఎంపీ కొండా



వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న ఎంపీ

కుల్కచర్ల గ్రామీణ: గోమాత సకల సంపదలకు నిలయమని చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఘనాపూర్ గ్రామంలో శ్రీ రామలింగేశ్వర గోశాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని గోమాతకు పూజలు జరిపించి అరటి పండ్లు తినిపించారు. అనంతరం మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతంలో గోశాలను ఏర్పాటు చేయడం సంతోషదాయకమని ఇందుకు ఘనాపూర్ గ్రామ ప్రజలను అభినందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో భాజపా రాష్ట్ర నాయకులు ఈశ్వరప్ప, భాజపా జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, పరిగి అసెంబ్లీ ఇన్‌ఛార్జి మారుతి కిరణ్ పాల్గొన్నారు.

వికారాబాద్ మున్సిపాలిటీ: వికారాబాద్ హౌసింగ్ బోర్డు కాలనీలో వెలసిన శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు కనుల పండువగా కొనసాగుతున్నాయి. బుధవారం మధ్యాహ్నం ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, భాజపా జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, నియోజక వర్గం కన్వీనర్ వడ్ల నందు తదితరులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పగడాల లక్ష్మీనారాయణ ఎంపీకి, నాయకులను శాలువాతో సత్కరించి స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు.

ఎంఎల్‌హెచ్‌పీ మెరిట్ జాబితా విడుదల

వికారాబాద్ మున్సిపాలిటీ: ఎంఎల్‌హెచ్‌పీ పోస్టులకు సంబంధించిన ప్రొవిజినల్ మెరిట్ జాబితాను విడుదల చేశామని జిల్లా వైద్యాధికారి డాక్టర్ పల్వాన్‌కుమార్ తెలిపారు. అభ్యర్థుల జాబితాను వికారాబాద్.తెలంగాణ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో పొందుపర్చామన్నారు. ఈనెల 10 నుంచి 16 వరకు అవసరమైన ధ్రువ పత్రాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు.

కష్టాలకు వెరవక.. లక్ష్యం వీడక

డీఎస్సీ సాధనలో రాణించిన జిల్లా యువత

ఉపాధ్యాయ ఉద్యోగం సాధించాలనేది వారి లక్ష్యం. ఇందుకోసం పేదరికం, ఆర్థిక కష్టాలు, కుటుంబ సమస్యలు వంటివి ఏవి ఎదురైనా వెనుకంజ వేయలేదు. పట్టుదలతో పగలూ, రాత్రి శ్రమించారు. కొందరికి తల్లిదండ్రుల ప్రోత్సాహం తోడైతే, మరికొందరికి స్నేహితుల ప్రోత్సాహం జతకలిసింది. ఇంకొందరికి అక్కచెల్లెళ్లు, భార్యాభర్తలు..వెన్నుతట్టి అండగా నిలిచారు. కొందరు గత డీఎస్సీలో వైఫల్యం చెందినా, మనోధైర్యంతో ముందుకే కదిలారు. తాజా డీఎస్సీలో టీచర్ ఉద్యోగానికి ఎంపికై తోటి వారికి స్ఫూర్తిదాయకంగా నిలిచారు.

కూలీ పనిచేస్తూ..



సాయిలు

కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్, న్యూస్‌టుడే: దౌల్తాబాద్ మండలం నందారం గ్రామానికి చెందిన సాయిలు తల్లిదండ్రులు లాలప్ప, రాములమ్మ చిన్నతనంలోనే మృతి చెందడంతో అక్క వద్ద ఉండి కూలీ పనులు, మేస్త్రి పనులు చేసుకొంటూ డిగ్రీ చేశారు. డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్‌గా నియామక పత్రం అందుకొన్నారు.

అన్న ప్రోత్సాహంతో ముందడుగు



వర్త్య లక్ష్మి

మోమిన్‌పేట:మండల పరిధిలోని రాళ్లగుడుపల్లి అనుబంధ గ్రామమైన గుట్ట మీద తండాకు చెందిన వర్త్య లక్ష్మి చిన్నప్పుడే తండ్రి, రెండేళ్ల కిందట తల్లి చనిపోయారు. నిరుపేద కుటుంబం కావడంతో లక్ష్మి అన్న రవికుమార్ ఇంటర్ మధ్యలోనే చదువు నిలిపేశారు. వ్యవసాయంచేసుకుంటూ చెల్లెలు లక్ష్మిని చదివించి ఎస్‌జీటీ సాధించేలా చేశారు.

కుమార్తెలూ తండ్రి బాటలో నడిచారు



శిరీష వినిష

యాలాల, న్యూస్‌టుడే: యాలాల మండలం జుంటిపల్లి గ్రామానికి చెందిన గొల్ల మొగులప్ప జీవన్గీ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు. వీరి కుమార్తెలు వినీష, శిరీష తండ్రి బాటలోనే నడిచి డీఎస్సీలో టీచర్లుగా ఎంపికయ్యారు. విశేషమేమంటే.. కూతుళ్లతో పాటు తల్లి మొగులమ్మ కూడా డీఎస్సీ రాసి కొద్ది మార్కులతోనే ఉద్యోగం అందుకోలేకపోయారు.

ముచ్చటగా మూడో ఉద్యోగం



సురేష్

బషీరాబాద్: బషీరాబాద్ మండలం ఎక్మాయికి చెందిన సురేష్ చిన్నతనంలోనే నాన్న మల్లప్ప చనిపోయాడు. తల్లి లక్ష్మి కూలీ పని చేసి కుమారుడిని చదివించింది. గురుకులంలో ఒప్పంద పద్ధతిపై పని చేస్తూ ప్రభుత్వ ఉద్యోగాలకు సన్నద్ధం అయ్యారు. ఇటీవల గురుకుల ఫలితాల్లో పీజీటీ, టీజీటీ హిందీలో రెండు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. తాజాగా హిందీ భాషా ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు.

కానిస్టేబుల్‌గా చేస్తూ టీచర్‌గా ఎంపిక



కావలి జ్యోతి కావలి బాలకృష్ణ

ధారూర్: ధారూర్ గ్రామానికి చెందిన కావలి అంజయ్య సత్యమ్మలకు పెద్ద కూతురు జ్యోతి. ఆమె 2019లో కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికై ధారూర్ ఠాణాలో ఉద్యోగం చేస్తున్నారు. భర్త బాలకృష్ణతో కలిసి టీచర్ ఉద్యోగం సాధించాలనే తపనతో కష్టపడి సాధన చేశారు. సెకండరీ గ్రేడ్ టీచర్ ఉద్యోగం సాధించారు.

తండ్రి ఆటో డ్రైవర్.. కూతురు ఉపాధ్యాయురాలు

తాండూరుగ్రామీణ: తాండూరు మండలం చెంగోల్ గ్రామానికి చెందిన లక్ష్మయ్య ఆటో నడుపుతూ పిల్లల్ని శ్రద్ధగా చదివించారు. ఈయన కూతురు సుప్రియ ఉపాధ్యాయురాలిగా నియామకమయ్యారు. ఇదే గ్రామానికి చెందిన ఆశప్ప వ్యవసాయం చేస్తారు. తండ్రి కష్టాన్ని చూసిన అశోక్ హైదరాబాద్ యూసుఫ్‌గూడలోని పోస్టాఫీస్‌లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తూ డీఎస్సీ సాధన చేశారు. ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఇదే గ్రామానికి చెందిన మౌనిక పొలం పనులు చేస్తూనే డీఎస్సీ రాసి టీచర్ ఉద్యోగం దక్కించుకున్నారు.

గజ వాహనంపై అనంత పద్మనాభ స్వామి



వికారాబాద్ పట్టణం ఆలంపల్లిలోని శ్రీ అనంత పద్మనాభ స్వామివారు బుధవారం గజ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనం ఇచ్చారు. స్వామివారికి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు.

– న్యూస్‌టుడే, వికారాబాద్ టౌన్.

పొలాల్లో ఫార్మా కంపెనీలొద్దు



ఆందోళన చేస్తున్న గిరిజనులు, భారాస నాయకులు

కొడంగల్, పరిగి, బొంరాస్‌పేట, న్యూస్‌టుడే: పొలాల్లో ఫార్మా కంపెనీలు వద్దంటూ రైతులు, గిరిజనులు ఆందోళనకు దిగారు. వీరి దీక్షకు మద్దతుగా మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి బుధవారం తలపెట్టిన పాదయాత్రను పోలీసులు అడ్డుకున్నారు. దుద్యాల మండలం పోలేపల్లి ఎల్లమ్మ ఆలయం నుంచి మండల కేంద్రం వరకు పాదయాత్ర నిర్వహించేందుకు మాజీ ఎమ్మెల్యే, రైతులు, భారాస కార్యకర్తలు యత్నించారు. వారిని ఎక్కడికక్కడే పోలీసులు అడ్డుకున్నారు. హకీంపేట, పోలేపల్లిలతో పాటు సమీపంలోని రైతులు వచ్చి హకీంపేట కూడలి వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో శ్యాసం రామకృష్ణ, సురేష్, మైపాల్, మధులతో పాటు గిరిజనులు పాల్గొన్నారు.

● పాదయాత్ర చేసేందుకు పోలేపల్లికి బయలుదేరిన మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డిని బొంరాస్‌పేట మండలం తుంకిమెట్ల గ్రామం వద్ద పోలీసులు అరెస్టు చేసి పరిగికి తరలించారు. సుమారు 500 మంది పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు.

నిర్లక్ష్యపు నీడలో.. ఆత్మీయ జ్ఞాపకం



న్యూస్‌టుడే, ధారూర్: పూర్వీకుల జ్ఞాపకాలను చిరకాలం గుర్తుండేలా ఆత్మీయుల పేరుమీద మొక్కలు నాటి వాటిని సంరక్షించాలనే లక్ష్యంతో ధారూర్‌లో స్మృతి వనాన్ని ఏర్పాటు చేశారు. మొక్కలను జాగ్రత్తగా పెంచడం, తద్వారా వారి జ్ఞాపకాలను ముందు తరాల వారు గుర్తుంచుకుంటారని అందరూ భావిస్తే అధికారుల పర్యవేక్షణ లోపంతో నిర్దేశిత లక్ష్యం నెరవేరడం లేదు. పట్టుమని 10 మొక్కలు కూడా నాటలేదంటే నిర్వహణ ఎలా ఉందో గ్రహించవచ్చు.

రూ.19 లక్షల వ్యయం... ఆరు ఎకరాల కేటాయింపు: ధారూర్ మండల కేంద్రంలోని సోమశంకరప్ప దేవాలయం సమీపంలో తాండూర్- వికారాబాద్ ప్రధాన రహదారి పక్కన 2019లో అటవీ శాఖ ఆధ్వర్యంలో సుమారు 6 ఎకరాల్లో స్మృతి వనాన్ని ఏర్పాటు చేశారు. ఇందుకోసం అప్పటి పాలనాధికారి ఒమర్‌జలీల్ రూ.19.04 లక్షల నిధులు మంజూరు చేశారు. వీటితో స్మృతి వనంలో ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా ఏర్పాట్లు చేశారు. చిన్న పిల్లలు ఆడుకోవడానికి ఊయలలు, జారుడు బల్లలు, సేద తీరడం కోసం అందమైన కట్టడం, చెట్లకింద కూర్చోవడానికి రచ్చబండలు నిర్మించారు. అందరినీ ఆకట్టుకునేలా అందమైన ముఖద్వారం, దానికి ఇరువైపులా వివిధ రకాల జంతు, ప్రకృతి సౌందర్యాల చిత్రాలు వేయించినా నిర్వహణ లేక పాత గోడలుగా మారాయి.

మొక్కకు రూ.5000 జమ చేస్తే చాలు: ఈ వనంలో ఆత్మీయుల పేరిట మొక్కలు నాటాలనుకునే వారు అటవీ శాఖ ఆధ్వర్యంలో కొనసాగే బ్యాంకు ఖాతాలో ఒక్కో మొక్కకు రూ.5 వేలు జమచేస్తే చాలు. మొక్క సంరక్షణ బాధ్యత అటవీ శాఖ ఆధ్వర్యంలో ఉంటుంది. సిబ్బంది తనకు నచ్చిన మొక్కను నాటి వాటిని సంరక్షిస్తుంటారు. అందుకోసం ఈ వనంలోనే వివిధ రకాల మొక్కలను అందుబాటులో ఉంచారు. ఆత్మీయుల పేరున నాటిన మొక్క ఎలా ఉందో పరిశీలించుకునే అవకాశం వారికి కల్పిస్తారు. పిల్లలు ఆడుకోవడానికి క్రీడ పరికరాలు, ఆటస్థలం కూడా నిర్మించారు. స్మృతి వనం ఏర్పాటుచేసి ఐదేళ్లు గడుస్తున్నా మొక్కలు నాటే కార్యక్రమం అనుకున్న స్థాయిలో జరగడం లేదు. ఇప్పటి వరకు ఉన్నతాధికారులు కేవలం 6 మొక్కలను మాత్రమే నాటారు. సామాన్య ప్రజలకు కూడా అవగాహన కల్పించి ఎక్కువ మొత్తంతో మొక్కలు నాటిస్తే ప్రయోజకరంగా ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవచూపి మరింత అవగాహన కల్పించాలని కోరుతున్నారు.

ఆదర్శ పనుల్లో నాణ్యత తప్పనిసరి



సిబ్బందితో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సుధీర్

బషీరాబాద్, న్యూస్‌టుడే: అమ్మ ఆదర్శ పాఠశాల పనులను మరింత నాణ్యతగా చేయించాలని అదనపు కలెక్టర్ సుధీర్ పేర్కొన్నారు. బుధవారం ఆయన బషీరాబాద్ మండలంలోని నవల్గా ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం, దామర్‌చేడ్, బషీరాబాద్‌లోని ప్రాథమిక పాఠశాలల్లో మూత్రశాలలు, శౌచాలయాలు, తాగునీటి సౌకర్యం, విద్యుత్ మరమ్మతుల పనులను పరిశీలించారు. పనులు చేసిన వాటికి వెంటనే నిధులు మంజూరు చేయాలని, మిగతా పనులు పూర్తి చేయించాలని అధికారులను ఆదేశించారు. నవల్గా ఆస్పత్రిలో గంట పాటు క్షుణ్ణంగా దస్త్రాలను పరిశీలించారు. ప్రభుత్వం సరఫరా చేసిన మందుల వివరాలు, అక్కడున్న మందులు సరిపోలేదని, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

చీఫ్ విప్ మహేందర్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు



మహేందర్‌రెడ్డికి అభినందనలు తెలుపుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు

న్యూస్‌టుడే, తాండూరు, తాండూరు గ్రామీణ, తాండూరు టౌన్: తెలంగాణ శాసన మండలి చీఫ్ విప్‌గా బుధవారం బాధ్యతలు చేపట్టిన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డికి తాండూరు నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు వేర్వేరుగా పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, ఎస్ఎస్‌సీ సభ్యుడు రమేష్ మహరాజ్, కోట్‌పల్లి మార్కెట్ కమిటీ ఛైర్మన్ అంజయ్య, డీసీసీబీ ఉపాధ్యక్షుడు రవీందర్ గౌడ్, మాజీ జడ్పీటీసీలు రాఖేష్ మహరాజ్, నాయకులు డాక్టర్ సంపత్‌కుమార్, గోపాల్‌రెడ్డి, అబ్దుల్ రవూఫ్, జుబేర్ లాల, తదితరులున్నారు.

యాలాల, న్యూస్‌టుడే: యాలాల మండల అభివృద్ధికి అధిక నిధులు కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని మహేందర్‌రెడ్డిని యాలాల మండల కేంద్రానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మాజీ ఎంపీపీ కరణం పురుషోత్తంరావు, మాజీ జడ్పీటీసీ సిద్రాల శ్రీనివాస్ కోరారు. ఎమ్మెల్సీని కలిసిన వారిలో అగ్గనూర్ మాజీ సర్పంచ్ భీమప్ప, మాజీ ఎస్ఎంసీ ఛైర్మన్ వెంకటయ్య, వీరప్ప, అశోక్, అంజి తదితరులు ఉన్నారు.

అటవీ సరిహద్దులో నేడు సర్వే

బషీరాబాద్, న్యూస్‌టుడే: కర్ణాటక సరిహద్దు.. బషీరాబాద్ మండలంలోని మైల్వార్, నీళ్లపల్లి అటవీ ప్రాంతంతో ఇరు రాష్ట్రాల అధికారులు నేడు సంయుక్త సర్వే నిర్వహించనున్నారు. బషీరాబాద్ తహసీల్దార్ వెంకటయ్య ఆధ్వర్యంలో రెవెన్యూ, అటవీశాఖ సిబ్బంది అన్ని పాత దస్త్రాలను సిద్ధం చేసి పెట్టారు.

సంక్షేమ పథకాలతో ప్రజలకు ఎంతో ఉపయోగం



సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

వికారాబాద్, న్యూస్‌టుడే: కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ముఖ్యమంత్రి సహాయనిధి వంటి సంక్షేమ పథకాలు ప్రజలకు ఎంతో ఉపయోగంగా మారాయని శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వికారాబాద్ మండలానికి చెందిన 14 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్, 15 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. దశల వారీగా అర్హులకు సంక్షేమ పథకాలు అందించడానికి ప్రభుత్వం కార్యాచరణ రూపొందించే పనిలో ఉందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ క్షేత్ర విజ్ఞానయాత్రకు జిల్లా రైతులు

తాండూరు: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అప్పారావు పేటలో అక్కడి రైతులు సాగు చేస్తున్న ఆయిల్ పామ్ తోటలను జిల్లాకు చెందిన రైతులు బుధవారం క్షేత్ర విజ్ఞానయాత్రలో భాగంగా సందర్శించారు. సమీపంలోనే తెలంగాణ రాష్ట్ర నూనె గింజల ఉత్పత్తి దారుల సహకార సమాఖ్య లిమిటెడ్ నిర్వహిస్తున్న కర్మాగారాన్ని రైతులు సందర్శించారు. కార్యక్రమంలో క్షేత్రస్థాయి అధికారి రవితేజ, ఏరియా మేనేజరు రాము, ఎకోపామ్ ఆయిల్, ఫ్యాట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ లేకుండానే నియామకాలా..

వికారాబాద్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ లేకుండానే ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడం మాదిగలకు ద్రోహం చేయడమేనని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆనంద్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ మాదిగ అన్నారు. రేవంత్‌రెడ్డి వైఖరిని నిరసిస్తూ బుధవారం కలెక్టరేట్ కార్యాలయాన్ని ముట్టడించి మాట్లాడారు.

తాండూరు కార్మికులకు ఈఎస్ఐ తెస్తా: ఎమ్మెల్యే

న్యూస్‌టుడే, తాండూరు, తాండూరు టౌన్: తాండూరులో కార్మికులకు మెరుగైన వైద్యం అందించేందు కోసం ఈఎస్ఐ ఆసుపత్రిని అందుబాటులోకి తీసుకు వస్తామని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తెలిపారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో తాండూరు, బషీరాబాద్ మండలాలతో పాటు పట్టణానికి చెందిన లబ్ధిదారులకు ఆయన రూ.18.40 లక్షల విలువ చేసే ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ స్వప్న, డీసీసీబీ ఉపాధ్యక్షుడు రవీందర్‌గౌడ్, గీత కార్మిక సంఘం అధ్యక్షుడు మేఘనాథ్‌గౌడ్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

తాండూరుగ్రామీణ, న్యూస్‌టుడే: ప్రైవేటు కర్మాగారాల పోటీని తట్టుకొని నిలబడేలా ప్రభుత్వ రంగ సిమెంటు కర్మాగారమైన సిమెంటు కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ)ని ఆధునీకరింపజేసేందుకు చర్యలు తీసుకోవాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డిని ఆ కర్మాగార ఉద్యోగుల సంఘం ప్రతినిధులు కోరారు. విషయాన్ని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

కారుడ్రైవర్‌కు రెండేళ్ల జైలు

కొడంగల్: అజాగ్రత్తగా వాహనం నడపడంతో పాటు ఒకరి మృతికి కారణమైన కారు డ్రైవర్‌కు న్యాయస్థానం బుధవారం రెండేళ్ల జైలుశిక్ష విధించింది. ఎస్సై సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. ఏడేళ్ల క్రితం పర్సాపూర్ గ్రామానికి చెందిన మోహన్ కారులో డ్రైవర్ సంతోష్‌తో తాండూరుకు వెళ్తూ కొడంగల్ రామాలయం వద్ద ఎడ్ల బండిని ఢీ కొట్టింది. దీంతో కారులో కూర్చొన్న మోహన్ మృతి చెందారు. మోహన్ భార్య సరోజ డ్రైవర్‌పై ఫిర్యాదు చేశారు. కొడంగల్ కోర్టులో న్యాయమూర్తి డ్రైవర్‌కు రెండు సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారని ఎస్సై వివరించారు.

అసంక్రమిత వ్యాధుల కట్టడి అవసరం

వికారాబాద్ మున్సిపాలిటీ: అసంక్రమిత వ్యాధులతో మరణాల రేటు అధికంగా ఉందని ఈ వ్యాధులను అరికట్టడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ పల్వాన్‌కుమార్ అన్నారు. బుధవారం జిల్లా వైద్యాధికారి కార్యాలయంలోని సమావేశం మందిరంలో అసంక్రమిత వ్యాధులపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న డీఎస్పీ ప్రశాంత్‌రెడ్డి

వికారాబాద్, న్యూస్‌టుడే: రోజువారీ జీవనంలో ఫోన్ ఎంత విస్తృతమైందో మోసాలు సైతం అదే వినూత్న స్థాయిలో పెరిగాయి. సైబర్ నేరగాళ్లు అధికంగా పదవీ విరమణ పొందిన ఉద్యోగులే లక్ష్యంగా చేసుకొని మోసాలకు పాల్పడుతున్నారని జిల్లా సైబర్ నేరాల నియంత్రణ కేంద్రం డీఎస్పీ ప్రశాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణ పోలీసులు, విశ్రాంత ఉద్యోగుల సంఘం, సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో వికారాబాద్ క్లబ్‌లో విశ్రాంత ఉద్యోగులతో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలని, చరవాణిని మీకు తెలియకుండానే సైబర్ నేరస్థులు హ్యాకింగ్ చేసి బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం నంబర్లు తీసుకుంటున్నారని తెలిపారు.

రోగులకు ప్రయోజనం.. సమస్యలు దూరం

వడి వడిగా ఆసుపత్రుల భవనాల నిర్మాణం

న్యూస్‌టుడే, తాండూరు, వికారాబాద్: రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో వైద్య సేవల విస్తరణకు వడివడిగా అడుగులు వేస్తోంది. జిల్లాలో 12లక్షల మంది జనాభా ఉంటే ఇందులో 80 శాతం మంది ప్రభుత్వ ఆసుపత్రులపైనే వైద్యం కోసం ఆధార పడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న ఆసుత్రులపై తాకిడి ఎక్కువగా ఉంటోంది. సమస్య పరిష్కారం కోసం వైద్య సేవలను విస్తరించేందుకు అవసరమైన భవనాలను వేగంగా నిర్మిస్తోంది. ఇందుకోసం రూ.109.9 కోట్లు వెచ్చిస్తోంది. తద్వారా ఉన్నత వైద్య సేవలు అందుబాటులోకి రావడమే కాకుండా పేదలకు ఆర్థిక, వ్యయ ప్రయాసలు కూడా తగ్గుతాయి. దీనికి సంబంధించి 'న్యూస్‌టుడే' కథనం.

ఆసుపత్రుల విభాగాలు..	నిధుల మంజూరు (రూ.కోట్లు)
వికారాబాద్ జనరల్ :	30
క్రిటికల్ కేర్:	24
ఆయుష్ :	12
కొడంగల్ :	26
బషీరాబాద్ :	10.6
పరిగిలో మరమ్మతులు :	1.30
హకీంపేటలో నిర్మాణం:	2.4
మందుల నిల్వ గోదాం:	3.6



వికారాబాద్‌లో ప్రారంభానికి సిద్ధంగా 300 పడకల ఆసుపత్రి

ప్రత్యేక వసతులతో ఆయుర్వేద, యునానీ భవనాలు



పూర్తి కావచ్చిన ఆయుష్ ఆసుపత్రి

వికారాబాద్‌లో ఆయుష్ ఆసుపత్రి పూర్తి కావచ్చింది. ఆయుర్వేదిక్, యునానీ వైద్య సేవలు అందుతాయి. జిల్లాలో వివిధ చోట్ల ఆయుర్వేద ఆసుపత్రులు ఉన్నా ప్రత్యేకంగా అన్ని వసతులతో కూడిన భవనాలు లేవు. ఈ భవనమే అధునాతనమైనదిగా పేర్కొనవచ్చు. ● బషీరాబాద్‌లో 6 పడకల ఆసుపత్రిని 30 పడకలకు విస్తరించే పనులకు టెండర్లు పూర్తయ్యాయి. ఇక కొడంగల్‌లో పాత ఆసుపత్రిని పూర్తిగా కూలదోసి దాని స్థానంలో జి+3 పద్ధతిలో నిర్మిస్తున్నారు.

జిల్లా ఆసుపత్రికి తగ్గనున్న తాకిడి

తాండూరులో 2001లో రూ.7 కోట్లతో 200 పడకల ఆసుపత్రి నిర్మించారు. రోజు రోజుకు దీనిపై రోగుల ఒత్తిడి పెరగడంతో ప్రభుత్వం తాండూరు పట్టణ శివారులో ప్రత్యేకంగా గర్భిణుల ప్రసవాల కోసమే 150 పడకలతో మాతా శిశు ఆసుపత్రి నిర్మాణాన్ని చేపట్టింది. ఇదే సమయంలో జిల్లా కేంద్రంలో జి+2 పద్ధతిలో ప్రత్యేకంగా 300 పడకల ఆసుపత్రి నిర్మాణాన్ని ఏడాది కిందటే ప్రారంభించింది. ప్రస్తుతం నిర్మాణం పూర్తయింది. దీన్ని ప్రారంభిస్తే జిల్లా కేంద్రంపై ఒత్తిడి తగ్గుతుంది.

జిల్లా కేంద్రంలో అత్యవసర సేవలు

జిల్లా కేంద్రంలో క్రిటికల్ కేర్ ఆసుపత్రి నిర్మాణమౌతోంది. జి+4 పద్ధతిలో 50 పడకలతో నిర్మిస్తున్న ఆసుపత్రిలో అత్యవసర వైద్య సేవలు అందుతాయి. ప్రమాదాలు, ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి వైద్యం ఇక్కడ అందుబాటులో ఉంటుంది.

ఆర్థిక సంవత్సరం చివరినాటికి పూర్తి

కొత్తగా నిర్మిస్తున్న భవనాలన్నీ ఈ ఆర్థిక సంవత్సరం చివరి నాటికల్లా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. దీనికి అనుగుణంగా పని చేస్తున్నాం. జిల్లా వాసులకు ఉన్నత, నాణ్యతతో కూడిన వైద్య సేవలు అందిస్తాం. **– జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ డీఈఈ లక్ష్మీనారాయణ.**

2వేల ఏళ్లనాటి టెర్రకోట గిరక లభ్యం



నంగునూరు, న్యూస్‌టుడే: సిద్దిపేట జిల్లా నంగునూరులో 2వేల ఏళ్ల నాటి టెర్రకోట మట్టి గిరక లభ్యమైనట్లు కొత్త తెలంగాణ చరిత్ర బృందం పరిశోధన సభ్యుడు కొలిపాక శ్రీనివాస్ తెలిపారు. బుధవారం నంగునూరు పాటిగడ్డ సమీపంలోని వ్యవసాయ క్షేత్రంలో 5 అంగుళాల ఎత్తు, 3 అంగుళాల వెడల్పుతో కలిగిన అద్భుతమైన పనితనం కలిగిన మట్టి గిరక లభ్యమైంది. దీన్ని నీళ్లు తోడడానికి గానీ.. మగ్గం నేయడానికి ఉపయోగించినట్లు తెలుస్తోంది. ఈ గిరకకు ఉన్న గాడి లోతు, అంచుల వంపును బట్టి దీని మీద మందపు తాళ్ల వాడినట్లు గుర్తులు కనిపిస్తున్నాయని తెలిపారు.

గడువులోగా స్టేషన్ పునరాభివృద్ధి పనులు

డీఆర్ఎం భరతేశ్‌కుమార్ జైన్



పునరాభివృద్ధి పనులు పరిశీలిస్తున్న డీఆర్ఎం భరతేశ్‌కుమార్ జైన్

జహీరాబాద్ అర్బన్: అమృత్ భారత్ స్టేషన్ పునరాభివృద్ధి పనులను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని దక్షిణమధ్య రైల్వే డీఆర్ఎం భరతేశ్‌కుమార్ జైన్ అధికారులకు సూచించారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ రైల్వేస్టేషన్‌ను బుధవారం తనిఖీ చేసి చేపడుతున్న పనులను పరిశీలించారు. స్టేషన్ ముఖద్వారం, వెయిటింగ్ హాల్, సీవోపీలు, ఎస్కలేటర్ సహా పార్కింగ్ ప్రాంతాల్లో నిర్మాణాలను సందర్శించి పనుల నెమ్మదిగా జరుగుతున్న తీరుపై అసంపూర్తి వ్యక్తం చేశారు. స్టేషన్ ప్రధాన ముఖద్వారం ఎర్రరాయి కట్టడంతో ఉన్నందున కొత్త నిర్మాణ అనుసంధానంలో ఇబ్బందులపై అధికారులు వివరించారు. అవసరమైతే పూర్తిగా తొలగించి త్వరగతిన నిర్మాణం పూర్తిచేయాలని సూచించారు. స్టేషన్ మేనేజర్ మాధవకృష్ణ పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. బీదర్-తిరుపతి రైలును జహీరాబాద్‌లో నిలిపేలా చూడాలని స్థానిక భాజపా నేతలు వినతిపత్రం అందజేశారు.

మనసు.. మాట వింటోందా!



కౌన్సెలింగ్, థెరపీలతో పరిష్కారం

‘మీరు మానసికంగా ఎంత స్థిరంగా ఉన్నా.. మీ మాటలు, చర్యల వల్ల కుటుంబ సభ్యులు, ఇతరులు ఎంతలా బాధపడుతున్నారో?’ ఎప్పుడైనా ఆలోచించారా.. మనసు స్థితి తేడాగా ఉందని తెలుస్తున్నా పరిష్కార మార్గానికి వైద్యులను ఆశ్రయించేందుకు వెనుకాడుతున్నారా.. అనేక అపోహలు.. మూఢ నమ్మకం.. తీవ్రమైన ఒత్తిడి, తెలియని ఆందోళన.. తరచూ తప్పుడు ఆలోచనలు.. వీటి నుంచి బయట పడితేనే జీవితం చక్కగా సాగుతుంది. చాలామంది వివిధ కారణాలతో మానసిక పరమైన జబ్బులతో వేదనకు గురవుతున్నారు. బాధితులతో పాటు కుటుంబ సభ్యులు తల్లడిల్లుతున్నారు. అందుబాటులో ఉన్న వైద్య సేవలను వినియోగించుకోవాలని నిపుణులు చెబుతున్నారు. నేడు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ‘న్యూస్‌టుడే’ ప్రత్యేక కథనం..

న్యూస్‌టుడే, సిద్దిపేట:

మానసిక ఆరోగ్యంపై అవగాహన లేక కొందరు కుంగిపోతున్నారు. సమస్య ఉన్నా.. ఏమి లేదనే భావనతో కాలం వెళ్లదీస్తున్నారు. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో అత్యధిక శాతం ఆరోగ్యంగా ఉన్నా.. అనారోగ్య సమస్యలు ఉన్నాయనే భావన (హైపో కాండ్రియాసిస్)తో ఆసుపత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. వివిధ రకాల పరీక్షలు చేస్తున్నా.. పరిష్కారం లభించక మదన పడుతున్నారు. ఎక్కువగా గుండె జబ్బు ఉందనే భావన వ్యక్తమవుతోంది. ఆయా పరిణామాలతో పలువురు ఇంటికే పరిమితవుతున్నారు. చివరికి మానసిక వైద్య నిపుణులను సంప్రదించడం ద్వారా అపోహలు తొలగిపోతున్నాయి. చిన్నపాటి విషయాలకే ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఉదంతాలు తరచూ చోటు చేసుకుంటున్నాయి. కుటుంబ కలహాలతో మనోవేదనకు గురై.. మానసిక అనిశ్చితి ఏర్పడుతోంది.



బాధితుడితో మాట్లాడుతున్న డాక్టర్ శాంతి



కీలకంగా సేవలు

సిద్దిపేట ప్రభుత్వ వైద్య కళాశాల అనుబంధ సర్వజన ఆసుపత్రిలో మానసిక వైద్య విభాగం (సైక్యాట్రీ) సేవలు కీలకంగా మారాయి. నిత్యం సగటున 50 మంది ఓపీ సేవలను వినియోగించుకుంటున్నారు. ఇక్కడ మొత్తం 30 పడకలు అందుబాటులో ఉన్నాయి. 15 - 20 మంది ఇన్‌పేషెంట్లుగా చేరుతున్నారు. ప్రాథమిక దశలో మానసిక జబ్బులతో చేరిన వారికి కౌన్సెలింగ్ ద్వారా మార్పు తెస్తున్నారు. పలు రకాల థెరపీలను అందిస్తున్నారు. రోగిస్థాయి ఆధారంగా గరిష్ఠంగా ఆరు నెలల వరకు చికిత్స అందిస్తున్నారు. ఆరోగ్యం బాగైన తరువాత వారిని ఉదాహరణగా చూపుతూ.. మార్పు సాధ్యమంటూ రోగుల్లో ధైర్యాన్ని నూరిపోస్తున్నారు. మానసిక ఒత్తిడి, కుంగుబాటు, చేసిన పనే చేయడం, సైకోసిస్, తదితర విభాగాల్లో బాధితులకు బాసటగా నిలుస్తున్నారు. డీ-అడిక్షన్ కేంద్రం సేవలు కీలకంగా మారుతున్నాయి.

సకాలంలో సేవలు పొందాలి..

– ప్రొఫెసర్ డా. శాంతి, మానసిక వైద్య నిపుణురాలు (సిద్దిపేట సర్వజన ఆసుపత్రి)



సేవలు అందించే క్రమంలో సైక్యాట్రీ చరిత్ర మొత్తం తెలుసుకుంటాం. కుటుంబ, వ్యక్తిగత వివరాలు, మానసిక స్థితి తెలుసుకొని ఒక అంచనాకు వస్తుంటాం. మానసిక స్థితిని పరీక్షిస్తాం. ఆలోచనలు, ఏకాగ్రత, నిర్ణయాలు తీసుకునే విచక్షణ, మాట్లాడే విధానం.. ప్రతీది కచ్చితమైన అంచనాతో చికిత్సలు చేస్తుంటాం. అవసరమైన వైద్య పరీక్షలు ఉంటాయి. కౌన్సెలింగ్, చికిత్స, థెరపీల ద్వారా బాగు చేస్తున్నాం. కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ చేపడుతున్నాం. మానసిక సమస్యలతో బాధపడే వారు సకాలంలో ఆసుపత్రికి రావడం లేదు. మార్పు రావాలి. డబ్బును వృథా చేసుకోవద్దు. ప్రతీ సమస్యకు ఒక పరిష్కారం ఉంటుందని గ్రహించి నిర్ణయం తీసుకోవాలి.

పరిణామాలు ఇలా..



- మత్తు పదార్థాలకు బానిసలుగా మారుతున్నారు. మానేసే ప్రయత్నాలు విఫలమై తప్పుడు నిర్ణయాలు తీసుకుంటున్నారు.
- స్వతహాగా కలవరపాటుకు గురవుతున్నారు. అనుమానాలు పెంచుకుంటున్నారు.
- అతి శుభ్రత (ఓసీడీ)తో ఇతరులను ఇబ్బందికి గురిచేస్తున్నారు.
- అభూత కల్పనతో గడిపేస్తున్నారు.
- మూఢ నమ్మకాలను విశ్వసిస్తున్నారు.
- లైంగిక, నిద్రలేమి లాంటి సమస్యల్లో చిక్కుకుంటున్నారు.
- విశ్రాంతి లేని జీవనం, తీవ్రమైన ఒత్తిడితో బాధపడుతున్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో నాలుగు రజతాలు



అథ్లెట్లతో వెంకటస్వామిగౌడ్

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: హనుమకొండలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సిద్దిపేట జిల్లా అథ్లెట్లు సత్తా చాటారు. ఏకంగా నాలుగు రజత పతకాలు సాధించారు. డెకథ్లాన్, హైజంప్ అంశాల్లో రాఘవాపూర్‌కు చెందిన గ్యార లీలాఆనంద్ రెండు రజత, అండర్-18 విభాగంలో కొండపాకకు చెందిన నగేశ్ జావెలిన్‌త్రోలో రజత పతకం, ఇదే కేటగిరిలో షాట్‌పుట్‌లో అథ్లెటిక్స్ అసోసియేషన్‌కు చెందిన వాసు రజత పతకం సాధించారని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గ్యాదరి పరమేశ్వర్, వెంకటస్వామిగౌడ్ తెలిపారు. ఈ మేరకు జిల్లా యువజన క్రీడల ఇన్‌ఛార్జి అధికారి జయదేవ్ ఆర్య, ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి సౌందర్య, ప్రతినిధులు, శిక్షకులు అభినందించారు.

‘విశ్వబ్రాహ్మణుల సంక్షేమాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వాలు’

సిద్దిపేట: విశ్వబ్రాహ్మణుల సంక్షేమాన్ని ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని, కార్పొరేషన్ సాధనకు సమష్టిగా ఉద్యమించాలని విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రోజు భిక్షపతి అన్నారు. సిద్దిపేటలో సమావేశానికి హాజరైన ఆయన జిల్లా అధ్యక్షుడు సాయన్నగారి శ్రీనివాస్‌తో కలిసి మాట్లాడారు. కుటీర పరిశ్రమలకు ఉచితంగా విద్యుత్తు సరఫరా చేయాలని, 50 ఏళ్లు నిండిన వారికి పింఛను ఇవ్వాలని, రాయితీపై కలపను అందించాలని, అటవీ అధికారుల దాడులు నివారించాలన్నారు. సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు గోపాలచారి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేశ్ తదితరులు ఉన్నారు.

జ్ఞానసమాజమే లక్ష్యం

27న ‘స్వేరోస్’ కన్వెన్షన్: ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్



గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్, ప్రతినిధులు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: విద్యాభ్యాసాన్నే ఆయుధంగా మలుచుకుని జ్ఞాన సమాజమే లక్ష్యంగా స్వేరోస్ నెట్‌వర్క్ కొనసాగుతుందని సంస్థ వ్యవస్థాపక ఛైర్మన్ ఆర్. ఎస్. ప్రవీణ్‌కుమార్ అన్నారు. కులాలు, మతాలకు అతీతంగా తమ నెట్‌వర్క్ నడుస్తుందన్నారు. అణచివేత, సామాజిక రుగ్మతలు, గంజాయికి వ్యతిరేకంగా రాబోయే రోజుల్లో పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని చెప్పారు. ఈనెల 27న సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల కేంద్రంలో స్వేరోస్ జాతీయ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు సిద్దిపేటలో కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికలను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమావేశానికి ఇతర రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు హాజరవుతున్నారన్నారు. బిజినెస్ అంశంపై సమాలోచనలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలే కాకుండా స్వయం ఉపాధి వైపు యువత ఏ విధంగా నడవాలనే అంశంపై చర్చిస్తామన్నారు. రాష్ట్ర కన్వీనర్ దుర్గయ్య, కోకన్వీనర్ వీరన్న, ప్రధాన కార్యదర్శి ప్రకాశ్, జిల్లా అధ్యక్షుడు ఉప్పలేటి బాబు, ప్రధాన కార్యదర్శి చిన్నికృష్ణ, ప్రతినిధులు పాల్గొన్నారు.



సిద్దిపేట: పార్వతీమాత ఆలయంలో నాణేలతో అభిషేకం



కుమార్తెలతో కలిసి బతుకమ్మ ఆడుతున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, సిబ్బంది



సంగారెడ్డిలో కలెక్టర్ వల్లూరు క్రాంతి, అధికారిణులు, సిబ్బంది

దర్శనంతో తాదాత్మ్యం.. ఆటాపాటతో ఆనందం

న్యూస్‌టుడే, పాపన్నపేట, మెదక్, సంగారెడ్డి టౌన్, సిద్దిపేట టౌన్: ‘శ్రీమహాకాళి మహాలక్ష్మి మహాసరస్వతి బాలత్రిపురసుందరి మాతాయై నమః’ అని మండపాలు, అమ్మవారి ఆలయాల్లో మంత్రోచ్ఛారణలు మార్మోగుతున్నాయి. ‘ఇద్దరక్కచెల్లెళ్లు ఉయ్యాలో.. ఒక్కూరికిచ్చి ఉయ్యాలో..’ అని మహిళల ఆటాపాట సందడి పూల పరిమళాల మధ్య ఉత్సాహభరితం చేస్తోంది. మెదక్, సంగారెడ్డి కలెక్టరేట్‌లలో కలెక్టర్లు రాహుల్‌రాజ్, వల్లూరు క్రాంతి, వారి కుటుంబ సభ్యులు బతుకమ్మల చుట్టూ ఆడారు. కొన్నిచోట్ల 8వ రోజున సద్దుల బతుకమ్మ పండుగ చేసి స్థానిక నీటివనరుల్లో నిమజ్జనం చేశారు.



సరస్వతిమాత అలంకరణలో ఏడుపాయల వనదుర్గ


నదిలో పడి యువకుడి మృతి



రమేష్

మనూరు, న్యూస్‌టుడే: ప్రమాదవశత్తు కాలు జారి నదిలో పడి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మనూరు మండలం రాయిపల్లి వద్ద బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన మున్నూర్ రమేష్(26) కాళ్లు కడుక్కుందామని నది వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలు జారి నదిలో పడి అక్కడికక్కడే మృతి చెందాడు. రమేశ్ తండ్రి నర్సింలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

చెరువులో పడి రైతు..



యాదయ్య

టేక్మాల్, న్యూస్‌టుడే: స్నానం చేసేందుకు చెరువులోకి వెళ్లి ప్రమాదవశాత్తు ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన మెదక్ జిల్లా టేక్మాల్ మండలం కుసంగి గ్రామ శివారులో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై రాజేశ్ తెలిపిన వివరాలు.. కుసంగి గ్రామానికి చెందిన ముస్లాపరం యాదయ్య(50) వ్యవసాయంతో పాటు మేకలను పెంచుతూ జీవిస్తున్నాడు. ఈ నెల 7న మేకలు మేపడానికి వెళ్లాడు. స్థానిక పెద్ద చెరువులో స్నానం చేద్దామని దిగాడు. ఈత రాకపోవడంతో చెరువులో మునిగి చనిపోయాడు. మేకలు ఇంటికి వచ్చినా యాదయ్య రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికారు. ఆచూకీ దొరకలేదు. బుధవారం చెరువులో మృతదేహం తేలింది. తమ్ముడు రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. యాదయ్యకు భార్య బూదవ్వ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పిల్లలకు వివాహాలు అయ్యాయి.

ఈత నేర్చేందుకు వెళ్లి మృత్యువాత

చిన్నకోడూరు, నంగునూరు: ఈత నేర్చడానికి వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మృతి చెందిన ఘటన చిన్నకోడూరు మండలంలోని ఓబులాపూర్‌లో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ ఆసీఫ్ తెలిపిన వివరాలు.. జక్కుల ఎల్లయ్య(38) కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతనికి భార్య భారతవ్వ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. బుధవారం ఉదయం ఎల్లయ్య తన సోదరుడు కుమారుడికి ఈత నేర్పించడానికి చెరువు వద్దకు తీసుకెళ్లాడు. ఎల్లయ్య చెరువులోకి దిగి ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. గమనించిన బాలుడు పరుగెత్తుకుంటూ వచ్చి గ్రామస్థులకు తెలిపాడు. వారు వెళ్లి ఎల్లయ్యను బయటకు తీసి చూడగా అప్పటికే మృతి చెందాడు. తల్లి ఎల్లవ్వ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదైంది.

రామలింగేశ్వరస్వామీ.. నీవైనా చెప్పవూ..

- ‘ప్రసాద్’ పథకానికి ‘కూడవెల్లి’ ఎంపికై రెండేళ్లు
- అడుగులు పడక.. పర్యాటకాభివృద్ధికి నోచుకోక..

న్యూస్‌టుడే, దుబ్బాక



శిథిలావస్థకు చేరిన గుళ్లు



రామలింగేశ్వర స్వామి

మన దేశంలో పర్యాటక రంగం ఎక్కువగా ఆధ్యాత్మిక క్షేత్రాల చుట్టూ ఉంటోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వివిధ కోణాల్లో ఆదాయాన్ని తెచ్చి పెడుతోంది. కానీ ప్రధానంగా భక్తులకు, పర్యాటకులకు మౌలిక వసతులను ప్రభుత్వం సమకూర్చితే ఆదరణ అధికంగా ఉంటుంది. రెండేళ్ల క్రితం సిద్దిపేట జిల్లా కూడవెల్లి రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వం ‘ప్రసాద్’ (తీర్థయాత్రల పునరుజ్జీవనం, ఆధ్యాత్మిక వారసత్వ వృద్ధి) పథకానికి ఎంపిక చేసింది. అమలు చేయడంలో వెనుకబాటులో ఉంది.

మిగిలినవి 9 ఎకరాలే

ఏడాది పొడవునా నిత్య పూజలను అర్చకులు నిర్వహిస్తున్నారు. వసతులు లేకపోవడంతో భక్తుల సంఖ్య రాకపోకలు తక్కువగా ఉంటోంది. గుడి భూములు అన్యాక్రాంతమయ్యాయి. ప్రస్తుతం కేవలం 9 ఎకరాలు మాత్రమే మిగిలాయి. ఇక్కడ 2004లో కల్యాణ మండపం నిర్మించినా పూర్తిస్థాయిలో వసతులు లేక వినియోగించటం లేదు. 2018లో దేవాదాయ శాఖ రూ.1.25 కోట్ల సర్వ శ్రేయోనిధి నుంచి అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. ప్రాకార మండపం, రాజ గోపురం, ప్రహరీ కొంతమేర పూర్తయ్యాయి. ‘ప్రసాద్ పథకానికి ఎంపికైనా నేటి వరకు ఆలయ పరిసరాల్లో పనులు చేపట్టలేదని.. రాష్ట్ర దేవాదాయ, పర్యాటక అభివృద్ధి శాఖల దృష్టికి తీసుకెళ్తామని.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నడుచుకుంటామని ఈవో విశ్వనాథశర్మ తెలిపారు.

పథకం అమలైతే సమకూరేవి

- కూడవెల్లి వద్ద రూ.కోటి నిధులతో ఒక ఎకరా స్థలంలో 20 రకాల మౌలిక వసతులు నిర్మిస్తారు.
- తీర్థయాత్ర సమాచార కేంద్రం, వెయిటింగ్ లాంజ్, శౌచాలాయాలు, ప్రసాదం కౌంటర్లు, ప్రథమ చికిత్స కేంద్రం, సంచులు పెట్టే గదులు, క్యాంటీన్, దుకాణాలు, బహుళ ఉపయోగకరమైన హాల్.

2022 నుంచి ఏం చేశారు?

- ఆలయ ఈవో 2022 నవంబరులో రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థకు, కేంద్ర పర్యాటక శాఖకు ప్రసాద్ పథకం అమలుకు కేటాయించే ఒక ఎకరా భూమి వివరాలు పంపించారు.
- పర్యాటక శాఖ అధికారులు ఆలయాన్ని సందర్శించారు.
- మౌలిక వసతులపై అంచనా వేసి, భూమి మట్టిని పరీక్షకు తీసుకెళ్లారు.

ఏమేం చేయాలి?

- కాశీ విశ్వనాథుడు, వేంకటేశ్వరుడు, బొబ్బిలి వీరన్న స్వామి గుళ్లు శిథిలమయ్యాయి. పునర్నిర్మించాలి.
- తాగునీరు సౌకర్యం కల్పించాలి.
- వాగులో పుణ్యస్నానాలు ఆచరించడానికి స్నాన ఘట్టాలు, దుస్తులు మార్చుకోవడానికి గదులు అవసరం.
- వాగులో వేసే పిండాలు, అస్థికలు, ఇతరత్రా కర్మకండ సామగ్రితో భక్తులు ఇబ్బంది పడుతున్నారు. ఏర్పాట్లు చేయాలి.

గుడి విశేషాలు

- అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని రామేశ్వరంపల్లి పరిధిలో కూడవెల్లి వాగు ఒడ్డున గుడి నెలవైంది.
- శ్రీరాముడు ప్రతిష్ఠించిన శివలింగం అని క్షేత్రపురాణంతో ప్రసిద్ధికెక్కింది. శతాబ్దాల చరిత్ర ఆలయానికి ఉంది.
- కాశీ నుంచి ఆంజనేయస్వామి తెచ్చిన శివలింగం.. శ్రీరాముడు ప్రతిష్ఠించిందీ రెండూ ఒకే ప్రాణవట్టంపై దర్శించుకోవడం విశిష్టత.
- మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి, కామారెడ్డి, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, వరంగల్, హైదరాబాద్, నిజామాబాద్ జిల్లాల భక్తులు ఎక్కువగా ఇక్కడికి వస్తారు.
- ‘కాళేశ్వరం’ ప్రాజెక్టు నుంచి గోదావరి జలాలు కూడవెల్లి వాగులోకి ప్రవహిస్తుండటంతో ఏడాది పొడవునా గుడి వద్ద జలకళ ఉట్టిపడుతోంది.
- ఆలయ ప్రాంగణంలో రాధారుక్మిణీ వేణుగోపాలుడు, దాసాంజనేయుడు, సంగమేశ్వరుడు, కుమారస్వామి, వీరభడుడు, పార్వతిమాత, గణపతి గుళ్లు దర్శనమిస్తాయి.
- గుడి పక్కనున్న కూడవెల్లి వాగులో పితృదేవతలకు పిండప్రదానాలు, అస్థికల నిమజ్జనం నిర్వహించుకోవచ్చు.
- శ్రావణం, కార్తికం, మాఘ మాసాల్లో .. ఇతర పండుగల రోజుల్లో జాతరలు, విశేష పూజలు జరుగుతాయి.

పురాతన ఇల్లు.. ప్రేమగా హంగులు



రంగు వేయడంతో ఆకట్టుకుంటున్న పెంకులు



ఇంటి లోపలి భాగం

పెద్దలు ఇచ్చిన ఆస్తిపాస్తులను యథాతథంగా దశాబ్దాలు గడిచినా కాపాడుకుంటూ వాడుకోవడం అరుదుగా చూస్తుంటాం. ఇళ్లు ఒక దశకు శిథిలావస్థకు చేరుతాయి. వాటికి కొద్దిపాటి మార్పులు, మరమ్మతులు చేస్తే అనేక ఏళ్లపాటు కుటుంబానికి అండగా ఉంటాయి. సిద్దిపేట జిల్లా కోహెడ మండలం గుండారెడ్డిపల్లికి చెందిన భూంపల్లి సంజీవరెడ్డి.. తన ఏడు దశాబ్దాల చరిత్ర ఉన్న ఇంటిని కొద్దిపాటి అధునాతన మార్పులు చేసుకొని కాపాడుకుంటున్నారు. అందులో భార్యతో కలిసి నివసిస్తున్నారు. చిన్నపాటి గుత్తేదారుగా పనులు చేసుకుంటున్న సంజీవరెడ్డికి పురాతన ఇంటిపై అమితమైన ప్రేమ. పైకప్పు పెంకులకు కొత్తగా రంగులు వేశారు. లోపల బండలు మార్చారు. ఇంటిలోని మొగురాలు, దూలాలు మార్చకుండానే వాటికి ఆకర్షణీయమైన రంగులు వేశారు. ఇంటిని పూర్తిగా తొలగించకుండానే అధునాతనంగా ఆకర్షణీయంగా మార్చుకున్నారు. ఊరిలో తన ఇల్లు వైవిధ్యంగా కనిపిస్తుండటం సంతోషంగా ఉందని ఆయన చెప్పారు. వారి పిల్లలు విదేశాల్లో ఉంటున్నారు.

- న్యూస్‌టుడే, కోహెడ గ్రామీణం

వాహనం అదుపుతప్పి కార్మికుడి దుర్మరణం

మునిపల్లి, న్యూస్‌టుడే: సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం బుదేరా శివారు జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో కంపెనీ కార్మికుడు దుర్మరణం చెందాడు. ఏఎస్సై ఏసయ్య తెలిపిన వివరాలు.. సదాశివపేట పట్టణానికి చెందిన పరిగి సాయికిరణ్ (29) ప్రైవేటు కంపెనీలో ఉద్యోగి. దిగ్వాల్ నుంచి సదాశివపేటకు బుధవారం ద్విచక్ర వాహనంపై వెళుతున్న క్రమంలో వాహనం అదుపు తప్పి పడిపోయాడు. తలకు బలమైన గాయాలయ్యాయి. ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్న క్రమంలోనే మృతి చెందాడు. భార్య వసంత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

టేక్మాల్: అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు బుధవారం పట్టుకున్నారు. ఎస్సై రాజేశ్, స్థానిక ఆర్ఐ సాయిశ్రీకాంత్ తెలిపిన వివరాలు.. మహారాష్ట్ర ఉమర్గ గ్రామానికి చెందిన బాలాజి కుమ్మర్ సుమారు 35 క్వింటళ్ల రేషన్ బియ్యాన్ని తన ఆటోలో తరలిస్తున్నాడు. హైదరాబాద్ నుంచి మహారాష్ట్రకు తరలిస్తున్న క్రమంలో బుధవారం బొడ్మట్‌పల్లి శివారులో పోలీసులకు బియ్యం పట్టుబడ్డాయి. వాహనాన్ని ఠాణాకు తరలించారు. పట్టుబడిన బియ్యాన్ని పాపన్నపేటలోని ఓ రైస్ మిల్‌కు తరలించి అక్కడే నిల్వ ఉంచినట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు టేక్మాల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

చికెన్ ధరలు			
ఫాంరేటు	114–00	డ్రెస్డ్	197–00
రిటైల్	136–00	స్కిన్‌లెస్	224–00

అమ్మమ్మ, నాయనమ్మల కళ్లుగప్పి ఆడ శిశువు అపహరణ

- సీసీ ఫుటేజీలో అనుమానితుల కదలికలు గుర్తింపు
- సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఘటన



శిశువును తీసుకెళ్లినట్లు అనుమానిస్తున్న మహిళలు (సీసీ ఫుటేజీ)

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: భూమి మీద పడి ఒక్క రోజు కూడా కాకుండానే ఆ ఆడ శిశువు తల్లికి దూరమైంది. సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో అమ్మమ్మ, నాయనమ్మల పక్కన సేదతీరుతుండగా పట్టపగలు.. ఇద్దరు మహిళలు అపహరించుకు పోవడం కలకలం రేపింది. సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం. . సంగారెడ్డి జిల్లా మనూరు మండలం దూదిగొండ గ్రామానికి చెందిన ఆటోడ్రైవరు అబ్బాస్ అలీ, నసీమా(25) దంపతులకు ఇద్దరు ఆడపిల్లలు, ఇద్దరు మగపిల్లలు ఉన్నారు. ఒక మగ బిడ్డ గతంలో మరణించారు. ఐదో కాన్పు కోసం భర్తతో కలిసి మంగళవారం అర్ధరాత్రి 2 గంటల ప్రాంతంలో నసీమా సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చేరింది. బుధవారం తెల్లవారుజామున 3 గంటలకు సిజేరియన్ ద్వారా ఆడ పిల్లకు జన్మనిచ్చింది. ఆ శిశువును కింద పడుకోబెట్టి మనమడితో కలిసి అమ్మమ్మ మునీబీ, నాయనమ్మ హమీదాలు మధ్యాహ్నం ఆస్పత్రి కారిడార్‌లో కూర్చున్నారు. బురకాలు ధరించిన ఇద్దరు గుర్తుతెలియని మహిళలు వారి కళ్లుగప్పి శిశువును ఎత్తుకెళ్లారు. కొద్దిసేపటి తర్వాత శిశువు కన్పించకపోవడంతో అవాక్కయి ఆస్పత్రి పర్యవేక్షకుడు అనిల్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే పట్టణ సీఐ భాస్కర్‌కు ఫిర్యాదు చేశారు. సంగారెడ్డి డీఎస్పీ, సీఐలు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితులతో మాట్లాడారు. ఆసుపత్రితో పాటు పట్టణంలోని ఇతర ప్రాంతాల్లోని సీసీ ఫుటేజీలను జల్లెడ పట్టారు. తొలుత ఇద్దరు గుర్తుతెలియని మహిళలు ఆసుపత్రి లోపలికి వచ్చి శిశువును అపహరించి, బయట వేచి ఉన్న మరో ఇద్దరు మహిళలకు ఇవ్వగా వారు ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లినట్లుగా గుర్తించారు. ఆటోలో ఇద్దరు.. స్కూటీపైన ఇద్దరు ఘటనా స్థలికి చేరుకున్నట్లు సీసీ ఫుటేజీల్లో నమోదైంది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి గాలింపు చేపట్టారు.

పది బృందాల ఏర్పాటు

ఘటనా స్థలాన్ని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ పరిశీలించారు. జిల్లావ్యాప్తంగా పోలీసులను అప్రమత్తం చేశారు. చెక్ పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. శిశువును గుర్తించేందుకు పది బృందాలను ఏర్పాటు చేశారు. కుమార్తె అపహరణకు గురైన విషయం తల్లికి తెలియనివ్వలేదు. తండ్రికి సమాచారం ఇవ్వగా బుధవారం రాత్రి ఆస్పత్రికి చేరుకొని బోరున విలపించాడు.

శిథిల ట్యాంకు తొలగించరూ..



కుల్కచర్ల, న్యూస్‌టుడే: పేటగడ్డ ప్రాంతంలో ఉన్న ఉపరితల జలాశయాగారం శిథిలావస్థకు చేరింది. దీన్ని 1980లో నిర్మించారు. గ్రామానికి పదేళ్ల క్రితం వరకు తాగునీటిని సరఫరా చేసింది. ఇప్పటికీ కూడా తాగునీటి సరఫరా జరుగుతోంది. కాగా ట్యాంకు అడుగుభాగం పెచ్చులూడుతోంది. చుట్టుపక్కల గృహాలు ఉన్నాయి. నీటి లీకేజీ లేనప్పటికీ శిథిలావస్థకు చేరిన ట్యాంకు ఎప్పుడు కూలుతుందోనని సమీప నివాస గృహాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా నియంత్రిక



పరిగి గ్రామీణ, న్యూస్‌టుడే: పరిగి మండలం నస్కల్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఇళ్ల పక్కనే ఉన్న నియంత్రిక ప్రమాదకరంగా మారింది. నియంత్రిక నుంచి ఇళ్లకు సరఫరా చేసేందుకు మధ్యలో కాడిన తీగలను ఏర్పాటు చేయడంతో తరచూ మరమ్మతులకు గురవుతూ చిన్న వాన జల్లులు పడినా మంటలు ఎగిసి పడతాయని భయాందోళనకు గురవుతున్నామని కాలనీ వాసులు తెలిపారు. రహదారికి, మురుగు కాలువ ఆనుకుని ఉండడంతోపాటు కంచె కూడా లేదని వారు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి నాణ్యమైన తీగలు, భద్రత కోసం కంచె ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా
వికారాబాద్‌టౌన్: 80742 74587
తాండూరు టౌన్: 80085 73260
పరిగి: 80085 73272
కొడంగల్: 94403 34770
(10 AM TO 1 PM)

రైతుల అనుమానాలు నివృత్తి చేయండి


మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్, పక్కన మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి

పరిగి: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫార్మాసిటీ కంపెనీ ఏర్పాటుపై ప్రజల్లో ఉన్న అనుమానాలను తక్షణం నివృత్తి చేయాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం భారాస ఇచ్చిన పిలుపులో భాగంగా మహా పాదయాత్రకు కొడంగల్‌కు వెళ్తుండగా ఆయనతో పాటు మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డిలను బొంరాస్‌పేట మండలం తుంకిమెట్ల వద్ద అదుపులోకి తీసుకుని పరిగికి తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.

జిల్లాలో ఒకే ఒక్కడు..సంస్కృత ఉపాధ్యాయుడు



తాండూరు టౌన్: తాండూరు మండలం మల్కాపూరు గ్రామానికి చెందిన శ్రీశైలం బీఎడ్, ఎంఏ సంస్కృతం, ఎంఏ ఫిలాసఫీ తదితరాలు చదివారు. 2012, 2017లో డీఎస్సీలో చివరి క్షణంలో ఉద్యోగం చేజారి పోయింది. 2019లో శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించి దీన్ని నిర్వహిస్తూనే డీఎస్సీలో రాణించారు. జిల్లాలో సంస్కృతంలో ఒకే పోస్టు ఖాళీ ఉండటంతో 6 మంది పోటీ పడ్డారు. వారిలో శ్రీశైలం ఉద్యోగం సాధించాడు.

లారీ యజమానులు ఉపాధి కోల్పోయే అవకాశం

తాండూరు, న్యూస్‌టుడే: రవాణా రంగం సమస్యలను పరిష్కరించాలని స్థానిక లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం డిమాండ్ చేశారు. ఇదే విషయంలో తాము రెండు రోజుల నుంచి సమ్మె నిర్వహిస్తున్నామని చెప్పారు. తాండూరులోని సిమెంటు కర్మాగారాలు స్థానిక లారీలకు లోడింగ్ ఇవ్వకుండా బయటి నుంచి వచ్చే లారీలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఫలితంగా తాము ఉపాధి కోల్పోవాల్సి వస్తుందని అన్నారు. ప్రస్తుతం ప్రతి టన్నుకు రూ.550 చొప్పున చెల్లిస్తున్న అద్దెను రూ.750కి పెంచాలని చెప్పారు. సమ్మెకు అసోసియేషన్ సలహాదారు, న్యాయవాది గోపాల్ మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్‌గని, శివకుమార్ పాల్గొన్నారు.

గంధం ఉత్సవాలను విజయవంతం చేయండి

తాండూరుగ్రామీణ, న్యూస్‌టుడే: చంద్రవంచ గేటు వద్ద మైబుస్వాన్ల దర్గా గంధం ఉత్సవాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు సుదర్శన్ రెడ్డి, పటేల్ రవిశంకర్, సరోత్తమరావు సూచించారు. ఈనెల 14న గ్రామం నుంచి దర్గా వరకు గంధం ఊరేగింపు నిర్వహిస్తామన్నారు.

సీపీఎల్ ప్రీమియర్ లీగ్ ప్రారంభం

షాద్‌నగర్: ఫరూఖ్‌నగర్ మండలం వెలిజర్ల పంచాయతీ కాలనీతాండలో సీపీఎల్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. నిర్వాహకులు బాబునాయక్, శివను అభినందించారు. పార్టీ నేతలు ఇస్నాతి శ్రీనివాస్, లష్కర్‌నాయక్, సుధాకర్, మహేందర్‌రెడ్డి, బాబునాయక్, శివ పాల్గొన్నారు

యువత క్రీడలకు ప్రాధాన్యమివ్వాలి

మొయినాబాద్: యువత క్రీడలకు ప్రాధాన్యమివ్వాలని చేవెళ్ల ఏసీపీ కిషన్, మొయినాబాద్ ఠాణా ఇన్‌స్పెక్టర్ జి.పవన్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ.. జీవిత లక్ష్యం వైపు సాగాలని సూచించారు. సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి, రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ ఆదేశాలతో ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో భాగంగా చిలుకూరు రెవెన్యూ పరిధిలోని కేజీరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం మొయినాబాద్ పోలీసుల ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు.

అనుమతి లేదని బైక్‌షోరూం సీజ్

కుల్కచర్ల: మండల కేంద్రంలో ఓ బైక్‌షోరూం అనుమతి లేదంటూ.. సీజ్ చేసి మళ్లీ కొన్ని గంటల్లోనే తాళం తొలగించిన సంఘటన చోటు చేసుకుంది. వివరాలు.. నంచర్ల రహదారి వైపు ఉన్న ఓ బైక్‌షోరూంకు పంచాయతీ నుంచి వ్యాపార అనుమతి లేదని, వాహనాలపై ఫైనాన్స్ సదుపాయం ఎలా కల్పిస్తున్నారని 'పేర్కొంటూ'.. ఇన్‌ఛార్జి ఎంపీవో భాస్కర్ సీజ్ చేశారు. దీంతో స్థానికంగా వివాదాస్పదంగా మారింది. అనుమతి లేకుంటే ముందుగా తాఖీదులు ఎందుకు ఇవ్వలేదని, ఇప్పటికే పలుమార్లు అనుమతుల కోసం వెళ్లినా స్పందించని ఎంపీటీసీ మాజీ సభ్యుడు రాంలాల్ ఎంపీవోతో వాగ్వాదానికి దిగారు. జిల్లా పంచాయతీ అధికారికి ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఎంపీవో భాస్కర్ మళ్లీ బైక్‌షోరూం తాళాలు తొలగించారు.

రైతుపై దాడి: కేసు నమోదు

కుల్కచర్ల గ్రామీణ: పొలం పనులు చేస్తున్న వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. బండవెల్కిచర్ల గ్రామానికి చెందిన జనపల హన్మంతురెడ్డి తన పొలంలో వేరుశనగ పంట వేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఇంతలో అదే గ్రామానికి చెందిన తిరుపతిరెడ్డి, చిన్నారెడ్డి, నర్సింహారెడ్డి, లక్ష్మమ్మ కలిసి హన్మంతురెడ్డిని పంట వేయకుండా అడ్డుకోవడమే కాకుండా దాడి చేశారు. దీంతో తలకు గాయాలయ్యాయి. అతడిని పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేపడుతున్నట్లు ఎస్సై తెలియజేశారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరికి గాయాలు

పూడూరు: ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరికి గాయాలయ్యాయి. ఎస్సై మధుసూదన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మీర్జాపూర్‌కు చెందిన రామచంద్రయ్య బుధవారం ద్విచక్ర వాహనంపై పొలం నుంచి ఇంటికి వెళ్తుండగా గేటు వద్దకు రాగానే ఎదురుగా వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీ కొట్టింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

వికారాబాద్, న్యూస్‌టుడే: పట్టణంలోని ఆలంపల్లి కాలనీలో ఓ గదిలో రహస్యంగా జూదం ఆడుతున్న ఏడుగురిని పట్టుకున్నట్లు వికారాబాద్ ఎస్సై సత్యనారాయణరాజు బుధవారం తెలిపారు. వారి నుంచి రూ.8,180 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

'అర్హులకు ప్రభుత్వ ఫలాలందేలా చూస్తాం'

పరిగి గ్రామీణ: అర్హులందరికీ ప్రభుత్వ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో ఎం.ఎ.కరీం, కాంగ్రెస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పరశురాంరెడ్డి, సత్యనారాయణ రెడ్డి, డీసీసీ నాయకులు హన్మంతు, లాల్‌కృష్ణ, పట్టణాధ్యక్షుడు కృష్ణ అన్నారు. బుధవారం పరిగి మండల పరిధిలోని సయ్యద్‌పల్లి, రాపోల్, చిట్యాల, తొండపల్లి, యాబాజిగూడ తదితర గ్రామాల్లో కార్యదర్శులతో కలిసి గ్యాస్ రాయితీ పత్రాలను పంపిణీ చేశారు.

దత్తత గ్రామంలో మౌలిక వసతులు

పూడూరు: గచ్చిబౌలిలోని సైబేజ్ ఆశ కార్పొరేట్ సంస్థ తమ సామాజిక బాధ్యతలో భాగంగా సోమన్‌గుర్తి గ్రామాన్ని దత్తత తీసుకొంది. అక్కడ మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు సంస్థ ప్రతినిధి సురేష్ తెలిపారు. బుధవారం రూ.8.75 లక్షలతో గ్రామంలో సిమెంటు రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్‌రెడ్డి, సీతారాంరెడ్డి, వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి యాదయ్య తదితరులు ఉన్నారు.

ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలపై నివేదిక

వికారాబాద్ గ్రామీణ, న్యూస్‌టుడే: సిద్దులూరు, రామయ్యగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన పనులు చేసేందుకు కలెక్టర్ ఆదేశించారని ఎంపీడీవో వినయ్‌కుమార్ తెలిపారు. బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పరిశీలించి నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందిస్తామన్నారు.

పచ్చని చెట్టే.. పల్లె సచివాలయం!

సొంత భవనాలు లేక ఇక్కట్లు


చెట్లకిందనే సమావేశం

న్యూస్‌టుడే, పూడూరు: కొత్తగా ఏర్పడిన గ్రామ పంచాయతీలకు సమస్యలు తప్పటం లేదు. ఏళ్లు గడుస్తున్నా.. ఇంకా పక్కా భవనాలు సమకూరక పోవటంతో ప్రజలతో పాటు ఉద్యోగులు నిర్వహణకు అనేక చోట్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తిమ్మాపూర్, దేవనోనిగూడ, మిట్టకంకల్, పుడుగుర్తి, గట్టుపల్లి, గొంగుపల్లి మేడికొండ, సిరిగాయపల్లి బాకాపూర్ తొమ్మిది గ్రామాలు కొత్త పంచాయతీలుగా ఏర్పడ్డాయి. కొత్త భవనాల నిర్మాణాలను చేపట్టేందుకు ఉపాధి హామీ ద్వారా ఒక్కోదానికి రూ.20 లక్షల నిధుల చొప్పున 11 భవనాలు మంజూరయ్యాయి. పనులు చేపట్టడంలో జాప్యం జరుగుతోంది. మండలంలో 50వేల జనాభా కలిగి ఉండటంతో పాటు 22 పాత పంచాయతీలు కలుపుకొని మొత్తం 31 గ్రామ పంచాయతీలు కొనసాగుతున్నాయి.

సమస్యలు కొన్ని..

- చన్‌గోముల్ గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామంగా కొనసాగిన తిమ్మాపూర్‌ను అధికారులు అప్పట్లో కొత్త పంచాయతీగా ఏర్పాటు చేశారు. ఇక్కడ అనుకూలమైన భవనం లేక పాఠశాల పాత భవనంలో పంచాయతీ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. అందులోనే అంగన్‌వాడీ కేంద్రం కూడా నిర్వహిస్తున్నారు. సమావేశాలు ఏర్పాటు చేయాల్సి వస్తే చిన్నారులకు, ఇటు పంచాయతీ పాలక వర్గానికి ఆటంకం కలుగుతోంది.
- గట్టుపల్లిలో తాత్కాలికంగా ఓ పురాతనమైన గదిని తీసుకుని కొనసాగిస్తున్నారు. వర్షం వస్తే ఉరుస్తోంది. కిటికీలు తలుపులు ఊడిపోయాయి. గత్యంతరం లేక ఇప్పటికి ఇందులోనే కొనసాగిస్తున్నారు. కొత్తభవనం నిర్మాణ పనులు ప్రారంభించి నెలలు కావస్తున్నా.. ఇప్పటికి అసంపూర్తిగానే మారింది.
- మిట్టకంకల్ కొత్తపంచాయతీగా ఏర్పడింది ఇక్కడ పాఠశాలలోని ఓగదిని తీసుకుని కొనసాగిస్తున్నారు. సమావేశాలకు తగిన సౌకర్యం లేదు కొత్తభవనం నిర్మాణం కోసం రూ. 20లక్షలు మంజూరు కావటంతో శిలాఫలకం వేశారు. ఇంకా పనులు ప్రారంభించలేదు.
- సిరిగాయపల్లిలో అంగన్‌వాడీ కేంద్రాన్ని తీసుకుని పంచాయతీ నిర్వహణ కోసం వాడుతున్నారు. చుట్టూ ప్రహరీ లేకపోవడంతో పాటు ఆవరణలోకి పశువులు, మేకలు, కుక్కలు సంచరిస్తున్నాయి. నిర్వహణకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
- సోమన్‌గుర్తి నుంచి విడిపోయిన దేవనోనిగూడ కొత్త పంచాయతీ గ్రామంలోని ఓ పురాతన బండల ఇంటిని తీసుకుని కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. నిర్వహణతో పాటు ఆసరా పింఛన్‌లు బయటనే ఇస్తున్నారు. సమావేశాలు ఉంటే చెట్లకింద ఏర్పాటు చేస్తున్నారు.
- పుడుగుర్తిలో అంగన్‌వాడీ కేంద్రాన్ని తీసుకుని పంచాయతీ నిర్వహణ సాగుతోంది.

పనులు చేయిస్తాం

– పాండు, ఎంపీడీవో, పూడూరు

కొత్తగా ఏర్పడిన పంచాయతీలకు పక్కాభవనాలను నిర్మాణం కోసం గత ఏడాదిలోనే నిధులు మంజూరయ్యాయి. కొన్ని చోట్ల గుత్తేదారు పనులు ప్రారంభించినా వివిధ కారణాలతో అసంపూర్తిగా వదిలేశారు. కొన్ని గ్రామాల్లో ఇంకా పనులు ప్రారంభించలేదు. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి త్వరితగతిన పనులు చేయించి అందుబాటులోకి వచ్చే విధంగా చూస్తాం.


బతుకమ్మ వేడుకల్లో కొడంగల్ అధికారులు


కొడంగల్ ఏవో లావణ్య


రాఘవాపూర్‌లో మండల, జిల్లా నాయకులు

తీరొక్క పూలతో.. ఊరూరా సందడి

ఊరూరా బతుకమ్మ సందడి నెలకొంది. బుధవారం కొడంగల్ తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో వివిధ శాఖల అధికారులు సంబురాలు నిర్వహించారు. తహసీల్దార్ విజయ్‌కుమార్, వ్యవసాయ అధికారిణి లావణ్య పాల్గొన్నారు. రాఘవాపూర్‌లో సంబురం అంబరాన్ని అంటింది. మోమిన్‌పేటలో మహిళలు భక్తి శ్రద్ధలతో ఆడిపాడారు.

- న్యూస్‌టుడే, బృందం


మోమిన్‌పేటలో మహిళల ఆటాపాటా..


ఆర్టీసీ డిపోలో బతుకమ్మ ఉత్సవం


పూజల్లో మాజీ ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి


దోమలో భక్తులు

అమ్మ రూపం.. అపురూపం

దేవీ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. జిల్లాలో భక్తి ప్రపత్తులతో నిర్వహిస్తున్నారు. మండపాలనుఅందంగా, ఆకర్షణీయంగా ముస్తాబు చేశారు. వారం రోజులుగా ఆయా ప్రాంతాల్లోని ఆలయాల్లో అమ్మవారిని వివిధ రూపాల్లో అమ్మవారిని అలంకరిస్తూ పూజలు చేస్తున్నారు. బుధవారం సరస్వతీ మాతగా దర్శనమిచ్చారు.

–న్యూస్‌టుడే, బృందం


ఇప్పాయిపల్లిలో మహిళలు


పూజల్లో సీసీఐ కర్మాగార అధికారులు, కుటుంబసభ్యులు

పేద పిల్లలకు దుస్తుల అందజేత

పరిగి: బాలసదనంలోని 55 మంది పేద విద్యార్థినులకు మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డి సతీమణి కొప్పుల ప్రతిమారెడ్డి దుస్తులు వితరణ చేశారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి మెహరున్నిసా, ప్రతిమారెడ్డి, సూపరింటెండెంట్ ఇందిర పాల్గొన్నారు.

జలమే ఎజెండా!

ఉపాధి పనులకు ఊరూరా సమావేశాలు • పల్లెల్లో అందరి డిమాండ్ అదే..

భూగర్భ జలాలు పడిపోతున్నాయి. పొలాల్లో వేసిన బోర్లలో నీటి లభ్యత ఆశించిన స్థాయిలో ఉండటం లేదు. కొన్ని చోట్ల నీళ్లు అడుగంటిపోతున్నాయి. రైతులు, పల్లెవాసులు జలం కోసం ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యకు పరిష్కారం దక్కనుంది. ఈ దఫా నిర్వహించే ఉపాధి పనుల్లో నీరే ప్రధాన ఎజెండా కానుంది. తాజాగా పంచాయతీల్లో నిర్వహించే సమావేశాల్లోనూ బోరు బావుల రీఛార్జికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని చర్చ జరుగుతోంది. దీనికి తోడు చెక్‌డ్యాంలు, నీటి మళ్లింపు కాలువలు, నీటితొట్ల, ఇంకుడు గుంతలు, ఊటకుంటలు నిర్మాణం తదితర పనులు కీలకంగా మారాయి.

- న్యూస్‌టుడే, కుల్కచర్ల, కుల్కచర్ల గ్రామీణ


ఎర్రగోవింద్‌తండా గ్రామసభలో రైతులతో చర్చిస్తున్న పంచాయతీ కార్యదర్శి

కూలీలకు ఉపాధిహామీ పథకం పనులను కల్పించేందుకు గ్రామాల్లో పనుల గుర్తింపు వేగంగా జరుగుతోంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో వీటిని చేపట్టనున్నారు. దీనికి గ్రామాల్లో రైతులు కోరిన పనులను పొలాల్లో ఎక్కడెక్కడ అవసరం? ఎంత వ్యయం అవుతుంది? అన్న వివరాలను పూర్తి స్థాయిలో సేకరించేందుకు ఉపాధి సిబ్బంది నిమగ్నమయ్యారు. అక్టోబర్ 2 నుంచి 30 నవంబరు వరకు గ్రామాల వారీగా వార్షిక ప్రణాళికను రూపొందిస్తారు. జనవరి 21 జిల్లా స్థాయిలో దీన్ని ఆమోదించనుండగా జనవరి 31 రాష్ట్ర స్థాయిలో జరుగుతుంది. మార్చి చివర్లో కేంద్రం ఆమోదం తెలుపుతుంది. ఏప్రిల్ నుంచి పనులను ప్రారంభిస్తారు. కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల్లో మొత్తం 12,143 జాబ్‌కార్డులు ఉన్నాయి. 25,473 మంది కూలీలు ఉండగా 4లక్షల పనిదినాలను కల్పించారు.

జాబ్‌కార్డుల జారీపైనా దృష్టి: పాతజాబ్‌కార్డులను అప్‌డేట్ చేయడంతో పాటు లేనివారికి జాబ్‌కార్డులను జారీచేస్తారు. ప్రతి కుటుంబానికి 100 రోజుల పని కల్పిస్తారు. సరాసరి ప్రతి మండలంలో ఏటా ఉపాధి పథకం కింద రూ. 10కోట్ల వరకు వ్యయం చేస్తున్నారు. చేసిన వ్యయంపైనా సామాజిక తనిఖీ కూడా జరుగుతోంది.

ఎలా గుర్తిస్తారంటే.. ముందుగా నిర్ణీత తేదీల్లో గ్రామాల వారీగా గ్రామ సభలను నిర్వహించి ఏ రైతు పొలంలో ఎలాంటి పనులు కావాలో అడిగి తెలుసుకుంటారు. ఆ వెంటనే పొలాల వారీగా పంచాయతీ కార్యదర్శి, ఈజీఎస్ క్షేత్రసహాయకుడు, సాంకేతిక సహాయకుడు బృందంగా వెళ్లి పనులను గుర్తింపును చేస్తారు. అనంతరం మళ్లీ గ్రామసభ నిర్వహించి పనులను ఆమోదించి జిల్లా స్థాయికి పంపించనున్నారు.

కుటుంబాల ఆధారంగా కార్డులు

- చంద్రశేఖర్, మండల అధికారి, కుల్కచర్ల

గ్రామాల్లో ఉపాధి పనుల గుర్తింపు చురుకుగా సాగుతోంది. నిర్ణీత సమయంలోనే తగిన నివేదికను జిల్లా యంత్రాంగానికి పంపిస్తాం. తదనుగుణంగా వచ్చే ఆమోదం ప్రకారం పనులను చేపడతాం. ఉమ్మడి కుటుంబం ఉన్నపుడు నమోదైన జాబ్‌కార్డులు ఉంటే వాటిని అప్‌డేట్ చేస్తాం.


ఎత్తుకాల్వతండాలో పనులు గుర్తిస్తున్న ఈజీఎస్ సిబ్బంది

కంకర పరిచి.. తారు మరిచి

నిధులు మంజూరైనా పూర్తికాని బీటీ రోడ్లు

న్యూస్‌టుడే, యాలాల: అచ్యుతాపూర్, జుంటిపల్లి, ఎన్కేపల్లి, పేర్కంపల్లి, పేర్కంపల్లి తండా, హాజీపూర్, కిష్టాపూర్ తదితర గ్రామాల రోడ్లకు 2021లో దాదాపు రూ.2.28 కోట్ల నిధులు మంజూరయ్యాయి. అప్పట్లో గుత్తేదార్లు రోడ్ల మరమ్మతుల్లో భాగంగా కంకర పరిచి తారు వేయకుండా వదిలేశారు. మూడేళ్లుగా భారీ వర్షాలకు గుంతలు పడి, ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. సకాలంలో పనులు పూర్తికాక పోవడంతో నిధులన్నీ వెనక్కి వెళ్లిపోయాయి. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు మళ్లీ నిధుల్ని తెప్పించి పనులు మొదలు పెట్టాలని పలువురు కోరుతున్నారు.


కంకర తేలిన జుంటిపల్లి, పగిడిపల్లి లింకు రోడ్డు

మచ్చుకు కొన్ని..

- ఎన్కేపల్లి గేట్ నుంచి పేర్కంపల్లి తండా మీదుగా బషీరాబాద్ మండలం కుప్పన్‌కోట్ వరకు 5కిలో మీటర్లకు రూ.44.78లక్షలు మంజూరు అయ్యాయి. గుత్తేదారు కంకర పరిచి తారు వేయలేదు. రైతులు పొలాలకు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
- హాజీపూర్ నుంచి కిష్టాపూర్ మీదుగా 3కిలోమీటర్లకు రూ.18లక్షలు మంజూరు అయ్యాయి. ఇప్పటి వరకు పనులు ప్రారంభించకపోవడంతో తారుపోయి గుంతలు ఏర్పడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
- అక్కంపల్లి గ్రామ సమీపం నుంచి జుంటిపల్లి పగిడిపల్లి వరకు కంకరతేలి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. ఆ రోడ్డుపై ద్విచక్రవాహనదారులు వెళ్లలేక పోతున్నారు.
- ముద్దాయిపేట్ రోడ్డు నుంచి అచ్చుతాపూర్ గ్రామం వరకు 3కిలో మీటర్లకు రూ.78లక్షలు మంజూరు కాగా.. గుత్తేదారు కిలోమీటర్ మేర బీటీవేసి, మిగతా రోడ్డును వదిలేశాడు.
- బండమీదిపల్లి నుంచి జుంటిపల్లి రామస్వామి దేవాలయం మీదుగా పగిడిపల్లి, జుంటిపల్లి గ్రామం వరకు రూ.1.39కోట్లు మంజూరు కాగా ప్రస్తుతం రూ.68లక్షలతో బండమీదిపల్లి నుంచి దేవాలయం వరకు తారు రోడ్డు వేశారు.

త్వరలోనే పనులు ప్రారంభిస్తాం

- సంతోష్, పంచాయతీరాజ్ ఏఈఈ యాలాల

యాలాల మండలంలో ఎన్కేపల్లి, కిష్టాపూర్, జుంటిపల్లి తదితర గ్రామాలలోని బీటీ రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు అయిన మాట వాస్తవమే. మిగతా గ్రామాల బీటీ రోడ్లకు ఆర్థికశాఖ నుంచి ఆదేశాలు రాగానే త్వరితగతిన రోడ్డు పనులు పూరిచేసి ప్రయాణికులకు ఇబ్బంది రాకుండా చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం బండమీదిపల్లి- జుంటిపల్లి రామస్వామి దేవాలయం వరకు 1.7 కిలోమీటర్ల పనులు పూర్తి చేశాం.


పేర్కంపల్లి కుడి కాలువ రహదారి


పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుల నియామకం

బషీరాబాద్, న్యూస్‌టుడే: పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం అసోసియేట్ అధ్యక్షులుగా బషీరాబాద్‌కు చెందిన రవికాంత్, శ్రీధర్‌రెడ్డి నియమితులయ్యారు. అసోసియేట్ ఉపాధ్యక్షులుగా ఈశ్వర్, విజయ్‌కుమార్ జ్యోషి, నాగరాజు, సాజీదాబేగం, రాష్ట్ర కార్యదర్శులుగా వీరేషం, శ్రీనివాస్‌గౌడ్, భీంరెడ్డి, అయూబ్ పాషాలను ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు శ్రీపాల్‌రెడ్డి ప్రకటించారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

మోమిన్‌పేట, న్యూస్‌టుడే: క్రమబద్ధీకరణ కోసం వచ్చిన ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆన్‌లైన్‌లో పొందపర్చాలని కార్యదర్శులకు ఎంపీడీవో విజయలక్ష్మి సూచించారు. బుధవారం మండల పరిషత్తు కార్యాలయంలో గ్రామ ప్రత్యేక అధికారులు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. దరఖాస్తుల వివరాలను రెవెన్యూశాఖ అధికారులు కార్యదర్శులు కలిసి పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో సీడీపీవో ప్రవీణ, పశువైద్యాధికారిణి గీత ఏపీవో శంకర్ పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి తక్షణ రుణసహకారం


రుణ చెక్కులను అందజేస్తున్న ఏజీఎం, మేనేజర్

బషీరాబాద్, న్యూస్‌టుడే: మహిళల ఆర్థికాభివృద్ధి కోసం తక్షణ రుణాలను అందిస్తున్నట్లు తెలంగాణ గ్రామీణబ్యాంకు శాఖల ఏజీఎం వెంకట్‌రాంరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన బషీరాబాద్ బ్యాంకు ఆవరణలో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 24 సంఘాలకు రూ.2.50 కోట్ల రుణాల చెక్కులను మహిళా సంఘాల సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ దీపక్, క్షేత్ర అధికారి నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.